వివాహ విశిష్టతను గుర్తించి మెలగాలి



కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

అడ్డగుట్ట: వివాహ విశిష్టతను గుర్తించి అందుకు అనుగుణంగా మెలగాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. పరిణయం మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన శాంతినగర్‌లో ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో అన్ని మతాలకు చెందిన వారికి వివాహ వ్యవస్థ పట్ల విశిష్ట స్థానం ఉంటుందని, భార్యా భర్తలు జీవితాంతం సుఖదుఖాల్లో కలిసి నడిచేలా కొనసాగే ఈ సంప్రదాయాన్ని గౌరవించాల్సి ఉందన్నారు. సంఘం నేతలు పంజా సమ్మయ్య, భవాని, లక్ష్మీపతి, రాజమల్లు, బీఆర్‌ఎస్ నేత గీతా దయాకర్ పాల్గొన్నారు.

కాల్వ విస్తరణ పనులు ప్రారంభించాలి



రొనాల్డ్‌రాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో వరదనీటి కాల్వ విస్తరణ పనులను సత్వరమే ప్రారంభించాలని బీజేపీ నాయకులు మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరానగర్‌లో వరదనీటి కాల్వ విస్తరణ పనుల కోసం రూ.80 లక్షలు ఏడాదిన్నర క్రితం కేటాయించినట్టు చెప్పారు. ఇందిరానగర్‌లోని ఐదు లైన్లలోని నాలాల్లో పూడికతీత పనులు జరగలేదని ఇప్పటి వరకు కాల్వల విస్తరణ, పూడికతీత పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికంగా మురుగు, వరదనీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. స్థానికుల సౌలభ్యం కోసం ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ భవనాన్ని మరో రెండు అంతస్తులు నిర్మించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో రవిప్రసాద్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, నగరపు శ్యామ్, పంపరి యాదగిరి ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్ల అందజేత



లాలాపేట: పారిశుద్ధ్య కార్మికుల్లో విధుల్లో భాగంగా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి సూచించారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు షూస్, మాస్కులు, శానిటైజర్ తదితర వస్తువులతో కూడిన కిట్లను అందజేసి మాట్లాడారు. నగరాన్ని శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమని కార్మికుల సంక్షేమానికి జీహెచ్‌ఎంసీ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఏఎంహెచ్‌ఓ వెంకటరమణ, శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి



అడ్డగుట్ట: బాల కార్మికులుగా మారుతున్న బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిన అవసరం ఉందని ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. మారేడుపల్లి మండల పరిధిలోని అంబేడ్కర్‌నగర్, లోహియా నగర్ ప్రాంతాల్లో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు పర్యటించి స్థానికంగా 14 మంది బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. అదే విధంగా కొత్తగా అడ్మిషన్ కోసం 12 మంది పిల్లలను కూడా స్కూల్‌కు తీసుకొచ్చి మొత్తం 26 మంది విద్యార్థులకు ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, ఇతర స్టేషనరీ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్ పావని, ఫౌండేషన్ ప్రతినిధులు భాగ్య, క్రాంతి రేఖ, అంగన్వాడీ టీచర్ రేణుక పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సందె గొబ్బెమ్మల పూజ



సనత్‌నగర్: సంక్రాంతి పర్వదినం వేళ మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా జరుపుకొనే సందె గొబ్బెమ్మల పూజను మోడల్‌కాలనీ మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాంక్రీట్ జంగిల్‌గా అవతరించిన మహానగరిలో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను నేటితరం ముందు ఆవిష్కరించారు. మోడల్‌కాలనీ ఉద్యానవనంలో గొబ్బెమ్మలను ఒకచోట పేర్చి ప్రత్యేక పూజలు జరిపారు. గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ శ్రావ్యమైన పాటలను ఆలాపించారు. కార్యక్రమంలో నాగమణి, రాజేశ్వరి, శిల్ప, హేమలత, మౌనిక, స్వర్ణ, పద్మిని, రాజకుమారి పాల్గొన్నారు. మోడల్‌కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎస్‌టీ శాయి ఏర్పాట్లు చేశారు.

ముగిసిన జూనియర్ నేషనల్ టోర్నమెంట్



అడ్డగుట్ట: యోనెక్స్ సన్‌రైజ్ ఎంకే హెచ్‌ఎస్‌ఎం ఇండియా జూనియర్ ర్యాంకింగ్ నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారంతో ముగిసింది. సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ వేదికగా జరిగిన ఈ టోర్నీ అండర్–19 ఉమెన్ సింగిల్ ఫైనల్లో, అలిషా నాయక్‌పై సూర్య చరిష్మ 11–21, 21–8, 21–18 గెలిచి టైటిల్ సాధించింది. బాయ్స్ అండర్–19 సింగిల్స్‌లో గిన్‌పాల్ పై ధృవ్‌నెగ్గి 21–16, 23–21 గెలిచాడు. డబుల్స్ మిక్స్‌డ్ డబల్ విన్నర్‌గా మిథిలేష్, రేషికా విన్నర్, బాయ్స్ డబల్స్ విన్నర్‌గా డి. అరోరా, అర్ష మహమ్మద్ విజయాలు సాధించారు. విజేతలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సిక్కిరెడ్డి అర్జున్‌రెడ్డి, మెదక్ జిల్లా చైర్మెన్ పీపీఎస్ రావు, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, యూవీఎస్‌బాబు, బహుమతులు అందజేశారు.

సాంకేతిక విద్యలో నాణ్యత పెంపుపై దృష్టి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక విద్యలో నాణ్యత పెంపు పై దృష్టి సారించినట్లు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యాదర్శి బుర్ర వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో ఏఐసీటీఈ విస్తృత స్థాయి అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా ఏఐసీటీఈ వైస్ ఛైర్మన్ డాక్టర్ అభయ్‌జెరే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

6 గ్యారంటీలకు 56003 దరఖాస్తులు



లబ్ధి చేకూరాలని దరఖాస్తుదారుల ఎదురుచూపులు

సనత్‌నగర్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

ఈ నెల 17 వరకు పూర్తి చేయాలన్న ఆదేశాలతో పనుల్లో వేగం

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గత నెల 22 నుంచి ఈ నెల 6 వరకు స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చకచకా కొనసాగుతోంది. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్ నమోదు తంతును వేగవంతం చేశారు. అభయహస్తం కింద మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత కింద సహాయం చేసేందుకు దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. వీటితో పాటు తెల్ల రేషన్‌కార్డుల కోసం కూడా దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి.

90 మంది ఆపరేటర్లతో..

సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల నుంచి మొత్తం 56003 అభయహస్తం దరఖాస్తులతో పాటు 18,528 ఇతర దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో బేగంపేట సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా డివిజన్లలో 16 సెంటర్ల ద్వారా 40680 అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. అలాగే ఆయా డివిజన్లలో తెల్ల రేషన్‌కార్డుతో పాటు ఇతరత్రా అవసరాల కోసం 14012 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల వ్యాప్తంగా 15323 అభయహస్తం దరఖాస్తులతో పాటు 4516 ఇతరత్రా దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు 90 మంది వరకు డీటీపీ ఆపరేటర్లను నియమించారు. వీరు ఇప్పటికే శిక్షణ తీసుకుని ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కూడా మొదలుపెట్టేశారు. జీహెచ్‌ఎంసీ బేగంపేట, ఖైరతాబాద్ సర్కిళ్ల కార్యాలయాల్లోనే దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పుడు ఉన్న డీటీపీ ఆపరేటర్లు సరిపోకపోతే ప్రైవేటు వాళ్లను నియమించాలని ఆదేశాలు అందాయి.



టీడీపీ ఆపరేటర్లకు సూచనలు ఇస్తున్న డీఎంసీ శంకర్

ఎంపికపై లేని స్పష్టత..

ఈ నెల 17వ తేదీ వరకు నమోదు పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. పలు పథకాలకు వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అందులో నుంచి అర్హులైన వారిని ఎలా ఎంపిక చేస్తారనే మార్గదర్శకాలు ఇంకా వెలువడలేదు. వచ్చేనెల నుంచి మహిళలకు రూ.2,500లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది మహిళల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అధికారులు అర్జీల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. అయితే ఈ సర్వే ఎప్పుడు చేస్తారు..లబ్ధిదారులను ఎప్పుడు ఎంపిక చేస్తారు..దీనికి ప్రాతిపదిక ఏమిటీ..ఏయే అర్హతలు చూస్తారు అనే అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. దరఖాస్తు చేసుకున్న వారంతా తమకు లబ్ధి చేకూరుతుందనే నమ్మకంతో ఉన్నారు.

డివిజన్ల వారీగా దరఖాస్తులు

డివిజన్	అభయహస్తం	ఇతర దరఖాస్తులు
బన్సీలాల్‌పేట	13923	4479
రాంగోపాల్‌పేట	8096	2870
బేగంపేట	10233	3397
మోండా	8428	3266
అమీర్‌పేట	5944	1653
సనత్‌నగర్	9379	2863



దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

బన్సీలాల్‌పేట, బేగంపేటలలో అత్యధికం..

సనత్‌నగర్ నియోజకవర్గంలో అత్యధికంగా బన్సీలాల్‌పేట, బేగంపేట డివిజన్ల నుంచి అభయహస్తం దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో డివిజన్‌లో పది వేల సంఖ్యను దాటడం గమనార్హం. బన్సీలాల్‌పేటలో 13,923, బేగంపేటలో 10,233 అభయహస్తం దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు డివిజన్లలో బస్తీలు ఎక్కువగా ఉండడంతో ప్రజాపాలనకు విశేష స్పందన వచ్చింది.

కేంద్ర నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి



పనులకు శంకుస్థాపన చేసిన రామకృష్ణ

రసూల్‌పురా: గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం మూడవ వార్డు అన్నానగర్ ఎన్‌టీఆర్ విగ్రహం వీధిలో బోర్డు నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బస్తీలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ అభివృద్ధి ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే జరుగుతోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి గెలిపిస్తే అధిక నిధులతో మరింతా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్, నాయకులు శీనివాస్ అరుణ్, ప్రవీణ్, హరి, భాస్కర్, కనకయ్య, బస్తీవాసులు పాల్గొన్నారు.

ముగిసిన చంద్రశేఖరేంద్ర సరస్వతీ ఆరాధనోత్సవాలు



మాట్లాడుతున్న విజయేంద్ర సరస్వతిస్వామి



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన స్కందగిరి దేవాలయంలో శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ 30వ ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పండితులు, కళాకారులు, రచయితలు, ఆధ్యాత్మికపరులతో స్కందగిరి ప్రాంతం సందడి మారింది. తిరుమల తిరుపతి దేవస్థానం, తెలంగాణ దేవాదాయ శాఖలకు చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో భగవద్గీత, రామాయణ, ఉపనిషత్తులు, శ్లోకాల పారాయణం, సదాశివ బ్రహ్మేంద్రకృతులు, పంచరత్న కృతులు, గురుకృతుల సామూహిక పారాయణం వంటి కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి. పద్మారావునగర్ కంచికామకోటి కల్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంచికామకోటి 70వ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి మాట్లాడారు. దేశంలో ధార్మిక ఉన్నతి కలగాలని...అప్పుడే దేశంలో సమగ్ర వికాసం పరిపూర్ణం అవుతుందన్నారు. నడిచే దేవుడిగా ప్రసిద్ధిగాంచిన చంద్రశేఖరేంద్ర సరస్వతీ 1994 జనవరి 8న శివైక్యం చెందారని చెప్పారు. 1964లో హైదరాబాద్ వచ్చి పద్మారావునగర్‌లో 40రోజుల పాటు బస చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాశీలో వేదవిద్య పాఠశాల నిర్వహిస్తున్న పండితులు దేవదత్త గోవింద్ పాటిల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, రచయిత విజయేంద్ర ప్రసాద్, స్కందగిరి దేవాలయం చైర్మన్ ఎల్వీ సుబ్రహ్మణ్యం(రిటైర్డ్ ఐఏఎస్), మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, చల్లా విశ్వనాథశాస్త్రీ పాల్గొన్నారు.

లేడీస్ హాస్టల్ గోడ దూకిన యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సైదయ్య

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ గోడ దూకిన ఓ అగంతకుడిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ఓయూ ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులుతో కలిసి వివరాలను వెల్లడించారు. ఓయూ క్యాంపస్‌లోని వీసీ లాడ్జి వెనకాల బస్తీలో నివాసముండే జంగా రాజు(24) కొంత కాలంగా ఓయూ హాస్టళ్లలో వర్కర్‌గా పనిచేసి మానేసి జులాయిగా తిరుగుతున్నాడు. ఓయూ వీసీ లాడ్జి సమీపంలో పీహెచ్‌డీ విద్యార్థినుల హాస్టల్ ఉంది. రాజు నివసిస్తున్న బస్తీ ఈ హాస్టల్ వెనకాలే ఉండటంతో కొన్ని రోజుల నుంచి రాజు లేడీస్ హాస్టల్ వెనకాల గోడ ఎక్కి విద్యార్థినులను చూసేవాడు. ఈ నెల 3న సాయంత్రం రాజు హాస్టల్ గోడపై నిల్చుని విద్యార్థినులను చూస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అటువైపు రావడంతో వారిని చూసిన రాజు పారిపోయాడు. హాస్టల్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో సీసీ కెమెరాల ఆధారంగా రాజును అరెస్టు చేశారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నేటి మహిళలు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఓయూ మహాత్మా జ్యోతి బాయి పూలే పరిశోధన కేంద్రం డైరెక్టర్ డా.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మెదక్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజీ సాధికారత విభాగం, ఓయూ ఆధ్వర్యంలో స్త్రీ విద్యకోసం సావిత్రీబాయి పూలే విశిష్ట సేవలు అనే అంశం పై వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా.హుస్సేన్ అధ్యక్షత వహించగా డా.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మహిళల విద్యాభివృద్ధి కోసం సావిత్రీబాయి చేసిన సేవలను వివరించారు. వర్క్‌షాప్‌లో సాధికారత కన్వీనర్ అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, డా.సుధాకర్, డా.దినకర్, వెంకటేశ్వర్లు, శరత్ రెడ్డి, వామన మూర్తి మాట్లాడారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెహ్రూనగర్, అల్వాల్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సా. 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, ప్రకాష్‌నగర్, సంజీవయ్యపార్కు సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సూర్యోదయ కాంప్లెక్స్, నల్లి సిల్క్ శారీస్ ఏరియా. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చీకోటి గార్డెన్, వరుణ్ మోటార్స్, సానాట, కట్టమైసమ్మ టెంపుల్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, సూర్యోదయ బిల్డింగ్స్, జీఈ బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేసిన ఆశ వర్కర్లు

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఆశ వర్కర్లు పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్‌పీహెచ్‌ఓ జయశ్రీ మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు పనిభారంతో కాస్త ఉపశమనం, వారిని ఉత్సాహపరిచేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాయి శంకర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డీసీపీకి అభినందనలు



ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ధరావత్ జానకి కి ఓయూ విద్యార్థి, తెలంగాణ గిరిజన స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు మోహన్ నాయక్ పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి వర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న ఎస్టీ విద్యార్థుల గురించి చర్చించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల క థనం ప్రకారం.. బొల్లారం–బొల్లారం బజార్ రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడ లభించిన కొన్ని ఆధారాలతో మృతుడు బహదూర్‌పురాకు చెందిన ప్రేమ్‌కుమార్ (27)గా గుర్తించారు.

తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఈ నెల 6 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత దరఖాస్తు చేసుకునే ప్రజల కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఆయా స్థానిక మండల కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సోమవారం నుంచి మారేడుపల్లి మండల కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేని వారు ఎవరైనా ఉంటే దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని అధికారులు తెలిపారు.

మార్కెట్లోకి చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్లు

సనత్‌నగర్: ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఫీచర్లతో సరికొత్త రూపును సంతరించుకున్న చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్లను మార్కెట్లోకి విడుదల చేశారు. బేగంపేటలోని చేతక్ షోరూంలో మంగళవారం రెండు మోడళ్ల స్కూటర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చేతక్ మార్కెటింగ్ హెడ్ శివకుమార్ వివరాలను వెల్లడించారు. గతంలో మార్కెట్లోకి వచ్చిన చేతక్ స్కూటర్ల ధరల కన్నా తక్కువగా అర్బేన్ రూ.1.23 లక్షలు, ప్రీమియం రూ.144,463 అందుబాటులో ఉన్నాయన్నారు. రెండు రకాల స్కూటర్లకు టీప్యాక్ పేరిట ఎస్‌సీడీ డిస్‌ప్లే, ఈకో స్పోర్ట్స్ మోడ్, రివర్స్ మోడ్, మ్యూజిక్, కాల్ మేనేజ్‌మెంట్, ఆఫ్ ఛార్జర్, నోటిపికేషన్ డిస్‌ప్లే థీమ్స్ తదితర ఫీచర్లు ఉన్నాయన్నారు. ఒకసారి ఛార్జింగ్‌తో 113 కిలోమీటర్ల ప్రయాణం, గంటలకు 63 కిలోమీటర్ల వేగంతో అర్బేన్, అలాగే ఒకసారి ఛార్జింగ్‌తో 126 కిలోమీటర్ల ప్రయాణం , గంటకు 73 కిలోమీటర్ల వేగంతో ప్రీమియమ్ స్కూటర్లను విడుదల చేశారు.

సీనియర్ సిటిజన్స్‌కు 20, 21 తేదీల్లో క్రీడా పోటీలు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం (సంస్కృతి భవనం)లో ఈ నెల 20, 21 తేదీల్లో సీనియర్ సిటిజన్స్‌కు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆసరా సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షులు జేఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో భాగంగా క్యారమ్స్ (సింగిల్స్, డబుల్స్), జీకే (జనరల్ నాలెడ్జ్), చదరంగం, టగ్గాఫ్ వార్, మ్యూజికల్ ఛైర్, బ్రిస్క్ వాకింగ్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు ఈ పోటీలకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 19వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు (ప్రసాద్ 89779 14856) (వైకేడీ ప్రసాద్ 94939 74300)ను సంప్రదించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం



గాంధీఆస్పత్రి: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం కల్పించి, ఆస్పత్రి ప్రాంగణంలో పచ్చందాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు అన్నారు. గాంధీ ఆస్పత్రిలో మంగళవారం డైట్ కిచెన్, ఎంసీహెచ్ భవన పరిసర ప్రాంతాల్లో హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తే రోగులకు త్వరితగతిన స్వస్థత చేకూరే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎంఓ–1 జయకృష్ణ, చీఫ్ డైటీషియన్ రమేష్, డైట్‌కిచెన్ కాంట్రాక్టర్ రవికుమార్, జనరల్ మేనేజర్ వెంకటసంతోష్, ఆర్ఎంఓ యోగేందర్ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి బీజేపీ అధికారంలోకి రావాలి



సికింద్రాబాద్: భారతదేశం మరింత ప్రగతి సాధించడం కోసం మరోమారు కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని కేంద్రం మంత్రి జీ.కిషన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో బీజేపీ నాయకులు నిర్వహించిన బస్తీబాట కార్యక్రమానికి ఆయన హాజరై శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు అవినీతి పార్టీలుగా గుర్తింపు తెచ్చుకున్నాయని అవినీతి మరకలేని ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకున్న నరేంద్రమోదీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలువాలన్నారు. కాలనీలు, బస్తీల్లో అవసరమైన అభివృద్ధి పనుల కోసం స్థానికులు తనను సంప్రదిస్తే ఎంపీ లాడ్స్ నిధులను కేటాయిస్తామన్నారు. మేకల సారంగపాణి, బండా కార్తీకరెడ్డి, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్, రమేశ్, శారదామల్లేశ్, అంబాల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



గణేష్

అడ్డగుట్ట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుషాయిగూడకు చెందిన గణేష్ (40) రెండు నెలల క్రితం అడ్డగుట్ట సీ–సెక్షన్‌లో నివాసముండే తన తల్లి ఇంటికి వచ్చాడు. మద్యానికి బానిసైన గణేష్ సమయానికి ఇంటికి వచ్చేవాడు కాదు. ఈ నెల 6న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన గణేష్ మూడు రోజులైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన తల్లి బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు

లాలాపేట: మైనర్‌లు డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలుంటాయని నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం తార్నాక చౌరస్తాలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తార్నాక ప్రధాన రహదారిలో మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వెళ్తున్న పలువురిపై చలాన్ విధించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారి తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. డ్రైవింగ్‌పై అవగాహన లేని మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

షట్టర్ తాళాలు పగలగొట్టి రూ.3.30 లక్షల చోరీ

రాంగోపాల్‌పేట్: రెండు వస్త్రాల దుకాణాల షట్టర్ తాళాలు పగలగొట్టి రూ.3.30 లక్షలు దోచుకెళ్లిన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన అశోక్ కుమార్ రాంగోపాల్‌పేట్‌లో గారోగ్య టెక్స్‌టైల్స్ పేరుతో వస్త్రాల దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి షట్టర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం వచ్చి సరికి షట్టర్‌ను పైకెత్తి ఉంది. లోపలికెళ్లి చూడగా కౌంటర్‌లో ఉండే రూ.3 లక్షల నగదు కనిపించ లేదు. ఇదే ప్రాంతంలో రోహిత్ అనే వ్యక్తి రోహిత్ ఇంటర్నేషనల్ పేరుతో నిర్వహిస్తున్న వస్త్రాల దుకాణంలో కూడా రూ.30 వేలను ఎత్తుకెళ్లారు. యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.